ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 21 జనవరి 2025



డీసీసీ బ్యాంకు మహాజన సభలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

7



దామోదర్ సేఫ్!

- మావోయిస్టు తెలంగాణ చీఫ్ మృతి వదంతే..
- నాలుగు రోజులైనా స్పష్టతనీయని పోలీసులు
- ఆ లేఖ నకిలీదేననే ప్రచారం
- స్పందించని మావోయిస్టు పార్టీ నాయకత్వం

6

- గర్జించిన గొంతులు.. మార్మోగిన డప్పులు..



వేయిస్తంభాల గుడి వద్ద డప్పు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో ఎమ్మెల్సీ మల్లన్న, అరూరి రమేష్, తదితరులు

కమిటీల పేరుతో కాలయాపన

- మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు
- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

7



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ



వేయిస్తంభాల ఆలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



ప్రశాంత్ (ఫైల్)

మంగపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధి మొట్లగూడెం వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక గ్రామానికి చెందిన రవి అనే కలప వ్యాపారి నరేంద్రరావుపేటకు చెందిన తాటి సమ్మయ్య వద్ద జామాయిల్ కలపను కొనుగోలు చేశాడు. అనంతరం కలపను సారపాక ఐటీసీ ఫ్యాక్టరీకి తరలిస్తున్నక్రమంలో మొట్లగూడెం బ్రిడ్జి సమీపంలోకి ట్రాక్టర్ చేరుకోగానే అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో సారపాకకు చెందిన డ్రైవర్ కారం ప్రశాంత్(24) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై పి.వి.ఆర్.సూరి ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రేమ పెళ్లి వాయిదా పడటంతో యువకుడి ఆత్మహత్య



భరత్‌కుమార్ (ఫైల్)


మొగుళ్లపల్లి, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి): ప్రేమించిన అమ్మాయితో పెళ్లి వాయిదా పడిందనే మనస్తాపం తో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మొట్లపల్లి గ్రా మానికి చెందిన వంగ కుమారస్వామి, కోమల దంపతులకు భరత్‌కు మార్(20), కుమార్తె శిరీష ఉన్నారు. ఆరునెలల క్రితం కోమల అనారోగ్యంతో మృతిచెందింది. ఓ యువతిని ప్రేమిస్తున్న ఆమె కుమారుడు భరత్ ఈ విషయాన్ని తండ్రి కుమారస్వామికి తెలిపాడు. ఇద్దరికి పెళ్లి చేయమని కోరాడు. తల్లి మృతి చెంది ఉన్న నేపథ్యంలో సంవత్సరీకం తర్వాత పెళ్లి చేస్తానని తండ్రి చెప్పడంతో భరత్ మానసికంగా కుంగిపోయాడు. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడే వాడు. ఇంటి సామాన్లు ధ్వంసం చేసేవాడు. ఇదే క్రమంలో ఆదివారం ఆదివారం భరత్ కుమార్ తమ పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని అతడిని జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న క్రమంలో భరత్ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం

- ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కావడం లేదని మనస్తాపం

మహాముత్తారం, జరనవరి20 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో పెళ్లికి ఆమె కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగపల్లికి చెందిన వాసం మహేష్ (24) ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని బంధువుల ద్వారా ఆమె తల్లిదండ్రులకు మహేష్ కబురు పంపాడు. తమ కూతురును అతడికి ఇచ్చేందుకు ఆ యువతి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన మహేష్ ఈ 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 19న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో సోమవారం మహేష్ మృతి చెందాడు. మృతుడి అన్న వాసం ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు.

భరోసా ఎట్లియ్యాలె..?



- అర్హత లేకున్నా రైతుబంధు అమలు
- గత ప్రభుత్వ హయాంలో అనేక మందికి లబ్ధి!
- ఇళ్ల స్థలాలు, వెంచర్లు, ఫంక్షన్ హాళ్ల స్థలాలకూ వర్తించిన పథకం
- రైతు భరోసా సర్వేలో విస్తుబోయే నిజాలు
- 2,490 ఎకరాలకు సొమ్ము అందిందని వెల్లడి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోవడం ప్రభుత్వాల కనీస బాధ్యత. పెట్టుబడులు లేక, పంటలను సరిగా సాగు చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతులకు అండగా నిలవడం పాలకుల కర్తవ్యం. ఇందులో భాగంగానే గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కూడా రైతు భరోసా పేరుతో అన్నదాతలకు ఆసరా కల్పించేందుకు సన్నద్ధమైంది. అయితే.. గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం పేరిట ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించడం మంచి ఉద్దేశమే అయినా అమలులో మాత్రం అవినీతి చోటుచేసు కుందని తెలుస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జిల్లాలో అనర్హులకు సైతం రైతుబంధు సాయం అందిందని వెల్లడవుతోంది. ఇందిరమ్మ రైతుభరోసా పథకాన్ని అమలు చేయా లని ఈనెల 16 నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో ఇలాంటి విస్తుబోయే విషయాలెన్నో బయటపడుతున్నాయి. అనేక మంది వెంచర్ యజమానులు కూడా రైతుబం ధుసాయం పొందినట్టు సర్వేలో తేలింది.

అర్హత లేకున్నా 2,490 ఎకరాలకు 'రైతుబంధు'

జిల్లాలో మొత్తం 1.19 లక్షల మంది రైతులకు చెందిన 2.43లక్షల ఎకరాలకు రైతుబంధు పథకం కింద ఏటా రూ.10వేల సాయం అందుతోంది. ఇందిరమ్మ రైతు భరోసా పథకం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి ఎకరాకు రూ. 12వేల చొప్పున పెట్టుబడిసాయం అందించేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రస్తుత సర్కారు రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు 44 బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. అయితే.. ఇప్పటి వరకు అధికారులు సర్వే చేసిన సర్వేలో విస్తుబోయే విషయాలు వెలుగు చూశాయి. జిల్లాలోని సుమారు 248 గ్రామాలతోపాటు మునిసిపల్ పరిధిలోని 30 వార్డుల్లోని వ్యవసాయ క్షేత్రాలు ఉండగా సుమారు 2,490 ఎకరాలకు అర్హతలేకున్నా రైతుబంధు సాయం అందుతున్నట్లు తాజాగా అధికారులు గుర్తించారు. ఇళ్లస్థలాలు, వెంచర్లు ఉన్న భూములకు సైతం రైతుబంధు అందుతున్నట్లు వెల్లడైంది. జిల్లాలో ఓ మాజీ ప్రజాప్రతినిధి వెంచర్‌కు కూడా రైతుబంధు సాయం అందుతున్నట్లు అధికారులు దృష్టికి వచ్చింది. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం ఉన్న భూ యజమానికి కూడా రైతుబంధు సాయం అందుతున్నట్లు తెలుస్తోంది.

రైస్ మిల్లులు, ఫంక్షన్ హాళ్లకు..

పలు రైస్ మిల్లులు, ఫంక్షన్ హాళ్లు ఉన్న స్థలాలకు కూడా రైతు బంధు నిధులు అందుతున్నట్లు అధికారుల సర్వేలో తేటతెల్లమైంది. ఈ అక్రమాలు ఇంత జోరుగా సాగినా గత ప్రభుత్వ కాలంలో అధికారులు వాటిపై దృష్టిసారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

గ్రామ సభల్లో వివరాలు వెల్లడించనున్న అధికారులు

జిల్లాలో 278 గ్రామాల్లో ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు జరగనున్నాయి. సర్వేలో గుర్తించిన వివరాలను అధికారులు గ్రామ సభల్లో వెల్లడించనున్నారు. ఈ సందర్భంగా రైతుబంధుకు అర్హతలేని భూముల వివరాలు బయటపడే అవకాశం ఉంది. సర్వేల్లో గుర్తించిన భూములను గ్రామసభల్లో ప్రజల ముందుంచనున్నారు. గత ప్రభుత్వం నుంచి రైతు బంధు అనర్హత కలిగిన భూములకు ఎంత లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించనున్నారు. గ్రామ సభల ఆమోదం అనంతరం ప్రభుత్వానికి పూర్తి వివరాలు అందించనున్నారు. జిల్లాలోని 2.43 లక్షల ఎకరాల్లో 2,490 ఎకరాలకు పోను మిగిలిన భూములకు ఇందిరమ్మ రైతుభరోసా పెట్టుబడి సాయం నిధులు అందనున్నట్లు తెలుస్తోంది.

మహిళల అభ్యున్నతికి కార్యాచరణ

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగులో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం
- గోవిందరావుపేట, వెంకటాపూర్ మండలాల్లో పర్యటన





మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, భూపాలపల్లి మండలం బావ్‌సింగ్‌పల్లిలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళా సంఘాల సభ్యులను అన్ని రంగాల్లో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళాశక్తి క్యాంటీన్‌ను మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ములుగు జిల్లాను అభివృద్ధిలో ముందుంచేందుకు కార్పొరేట్ కంపెనీల సహకారం తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు ఎనిమిది గ్రామాలను దత్తత తీసుకొని రూ.2.5 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టి ఏడాది కాలంలో పూర్తిచేస్తామని చెప్పారు. రూ.5.11 కోట్ల వ్యయంతో ములుగులో అత్యాధునిక హంగులతో బస్టాండును నిర్మిస్తామన్నారు. ఏటూరునాగారంలో డిపో, మంగపేటలో బస్టాండు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాడ్వాయి బ్లూబెర్రీ ఐలాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. నిరుద్యోగుల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్. దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు మోహన్‌లాల్, డీపీవో దేవరాజు, ఏపీడీ బాలస్వామి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు డు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మంత్రి

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ములుగులోని రవాణాశాఖ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సుకు మంత్రి సీతక్క హాజరయ్యారు. ట్రాఫిక్

మిగతా 8వ పేజీలో...

ఉమ్మడి జిల్లా నుంచి..

ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

- ఎక్సలెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు



ప్రొఫెసర్ పాండురంగారావు



దీప్తి

వివరాలు 7వ పేజీలో..

24న కొండపర్తికి గవర్నర్

- దత్తత గ్రామానికి రానున్న జిష్ణుదేవ్ వర్మ
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు

వివరాలు 7లో..





ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

పన్ను వసూళ్ల చేతివాటంపై డీపీవో ఆరా!

మహదేవపూర్ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాల్లో ఆస్తి పన్నుల వసూళ్ల బాగోతంపై జిల్లా పంచాయతీ అధికారి ఆరా తీస్తున్నట్టు తెలిసింది. 'ఆన్‌లైన్ బిల్లు.. ఆఫ్‌లైన్ రశీదు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఈ మేరకు స్పందించినట్టు సమాచారం. పన్నుల వసూళ్లలో పంచాయతీ కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తుండటంపై డీపీవో ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ప్రజలను మాయచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని మహదేవపూర్, పలిమెల మండలాల పంచాయతీ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆంధ్రజ్యోతిలో కథనంపై ప్రచురితం కాగా ఈ వ్యవహారం బయటకు రావడంతో పలువురు బాధితులు పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కథనంపై నిఘావర్గాలు సైతం ఆ కార్యదర్శులు ఎవరు అని పలు గ్రామాల్లో ఆరాతీసినట్లు సమాచారం.

నకిలీ మందులు అమ్మారంటూ రైతుల ఆందోళన



చిల్కోడులో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

డోర్నకల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం చిల్కోడులో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన పురుగుల మందు మిర్చి పంటపై వస్తున్న నల్ల తామర నివారణ కొరకు కొంతమంది రైతులు వాడారు. ఆ మందు పిచికారీ చేసిన అనంతరం తోటలు దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ షాపు ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, సీఐ రాజేష్‌లు అక్కడికి చేరుకున్నారు. షాపు యాజమాని వద్ద ఉన్న మందులను పరీక్షించి సరఫరా చేసిన తిరుపతి అనే డీలర్‌ను రప్పించారు. ఎండోఫిల్ ఎలక్ట్రో కంపెనీ లోగోలు తేడాగా ఉన్నాయని, ఇది నకిలీదని, తమకు నష్టం జరిగిందని రైతులు అతన్ని నిలదీశారు. తాము వీటిని కంపెనీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామని తిరుపతి సమాధానం చెప్పారు. కొన్ని శాంపిల్స్‌ను సేకరించిన వ్యవసాయాధికారి వాటిని ల్యాబ్‌లో పరీక్షించి నకిలీవని తేలితే చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్‌కాల్‌తో రూ.95,100 మాయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఓ అపరిచిత వ్యక్తి వద్ద నుంచి వచ్చిన ఫోన్‌కాల్ లిఫ్ట్ చేయడం వల్ల తన అకౌంట్‌లోని రూ. 95,100 మాయమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తిపాక కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక కాలనీకి చెందిన ఓ వ్యక్తికి అపరిచిత వ్యక్తి వద్ద నుంచి ఫోన్‌కాల్ రావడంతో లిఫ్ట్ చేశాడు. ఆ వెంటనే తన అకౌంట్‌లో ఉన్న రూ.95,100 విత్‌డ్రా చేసుకున్నట్లు మెసేజ్ వచ్చినట్లు చెప్పారు. ఆ మెసేజ్‌ను చూసుకున్న ఆ వ్యక్తి వెంటనే తన అకౌంట్ వివరాలు చెక్ చేసుకోగా అతని అకౌంట్ నుంచి అమౌంట్ కట్ అయినట్లు తెలుసుకున్నాడు. వెంటనే మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఏటూరునాగారం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతాల్లో జీవో 3 అమలుతో పాటు 29 శాఖలపై ట్రైబల్ అడ్వైజరీ కమిటీ, అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని చట్టాలు అమలు కాక ఆదివాసులు అవస్థలు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆదివాసుల పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించి వారి పొలాల్లో ఉచితంగా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన ఇసుక సొసైటీలకు క్యూబిక్ మీటరు రూ. 220 నుంచి రూ.450కి పెంచాలన్నారు. అనంతరం పలు డిమాండ్లకు కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ఉయిక శంకర్, ధనసరి రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యలను త్వరగా పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీవో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. 24మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. పలు వినతులతో పాటు కన్నాయిగూడెం మండలంలో కొమురం భీం విగ్రహ ఏర్పాటునకు సహకరించాలని తుడుందెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు పోడెం బాబు పీవోను కోరారు. ఈకార్యక్రమంలో డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో పీవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

'పీఎం కుసుం' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'పీఎం కుసుం' పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 'పీఎం కుసుం' పథకంపై పెసా మొబిలైజర్‌కు అవగాహన కార్యక్రమంలో పీవో మాట్లాడారు. 4 ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ లేదా రెవెన్యూ పట్టా భూమి ఉండి సబ్‌స్టేషన్లకు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న భూములను 25 సంవత్సరాలకు లీజు తీసుకుంటుందని వెల్లడించారు. ఎకరం భూమికి సంవత్సరానికి రూ.12,500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని పీవో తెలిపారు. ఆ భూముల్లో సౌర విద్యుత్ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పి వాటి నిర్వహణను స్వయం సహాయక సంఘాల ద్వారా చేపడతామన్నారు. పీఎం కుసుం పథకంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని పెసా మొబిలైజర్లకు పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఎస్‌డీసీ డీటీ అనిల్, ఆర్వోఎఫ్ఆర్ డీటీ వెంకన్న పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు దరఖాస్తులు

ఐటీడీఏ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసై, 18 నుంచి 45 సంవత్సరాల గిరిజన మహిళలు ఈ నెల 27లోపు ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పీవో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8330954571 నంబర్‌ను సంప్రదించాలని పీవో చిత్రామిశ్రా తెలిపారు.

ఏజెన్సీ యువతికి ఐఎంఏ ఎంబీబీఎస్ పట్టా



హైదరాబాద్‌లో పట్టా తీసుకుంటున్న పావని

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన ఏజెన్సీ యువతి ఇండియాలో వైద్యం చేసేందుకు అర్హత కావాల్సిన ఐఎంఏ పట్టా సాధించారు. కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భైరబోయిన సదానందం, విజయలలిత దంపతుల కూతురు భైరబోయిన పావని రష్యా కిర్గిజిస్తాన్ దేశంలో బిష్కెక్ పట్టణంలో ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఐహెచ్ఎస్ఎం) యూనివర్శిటీలో 2019 నుంచి 2024 వరకు వైద్య విద్యను అభ్యసించింది. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ఇండియాలో వైద్యం చేయాలంటే ఐఎంఏ పట్టా పొందాల్సి ఉంది.

హైదరాబాద్ మెహదీపట్నంలోని మెడికల్ అకాడమీలో పావని ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసి ఐఎంఏ ఎంబీబీఎస్ పట్టా పొందారు. పావని వైద్యవిద్యా పట్టా సాధించడంతో పొగుళ్లపల్లిలో వైద్యుల సంఖ్య నలుగురికి చేరింది.

దామోదర్ సేఫ్!

- మావోయిస్టు తెలంగాణ చీఫ్ మృతి వదంతే..
- నాలుగు రోజులైనా స్పష్టతనీయని పోలీసులు
- ఆ లేఖ నకిలీదేననే ప్రచారం
- స్పందించని మావోయిస్టు పార్టీ నాయకత్వం



దామోదర్ (ఫైల్)

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల 16న ఛత్తీ‌స్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు హతమైనట్లు ఆ రాష్ట్ర పోలీసులు ప్రకటించారు. సంఘటన జరిగిన రెండురోజుల తర్వాత మొత్తం 18 మంది మృతిచెందారని, క్షిపణితో పోలీసులు జరిపిన దాడిలో తెలంగాణ చీఫ్ దామోదర్‌ను కోల్పోయామంటూ దక్షిణ బస్తర్ డివిజన్ కార్యదర్శి గంగ పేరిట ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. దీంతో దామోదర్ మరణించాడని అందరూ భావించారు. అయితే లేఖలో స్పష్టత లేకపోవడం, ఆయన మృతిని పోలీసులు నిర్ధారించకపోవడంతో అంతా సందిగ్ధంలో పడ్డారు. రూ.50లక్షల రివార్డును కలిగి ఉండి గత రెండున్నర దశాబ్ధాలుగా తెలంగాణ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఆ శాఖకు అతిపెద్ద విజయంగా భావించవచ్చు. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లు, సమాచారం ఇచ్చిపుచ్చుకునే విషయాలలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన డీజీపీ ర్యాంకు అధికారులు సరిహద్దు ప్రాంతాలలో తరుచూ సమావేశమవుతూ ఉంటారు. అలాంటిది ఒకవేళ దామోదర్ మరణించినట్లయితే మన రాష్ట్రానికి చెందిన పోలీసు ఉన్నతాధికారులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి నిర్ధారించుకునే అవకాశముంది. కానీ, ఎన్‌కౌంటర్ జరిగి ఐదురోజులు గడిచినా పోలీసు వర్గాల నుంచి స్పష్టత లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శి స్థాయి నేతకు భారీ భద్రత ఉంటుంది. కనీసం మూడంచెల రక్షణ వలయంలో.. 20మందికి తగ్గకుండా అంగరక్షకులు అతని చుట్టూ ఉండే అవకాశముంది.

16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో ఎక్కువమంది మిలీషియా సభ్యులే కాగా ఆస్థాయి వారిని స్టేట్ చీఫ్ సెక్యూరిటీకి నియమించే అవకాశం లేదు. లేఖలో పేర్కొన్నట్లుగా ఒక వేళ దామోదర్ చనిపోయినా ఆయన అంత్యక్రియలు ఎలా జరిగాయోననే సమాచారం లేదు. ఫొటోలు కూడా రాలేదు. క్రితం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ కరోనా బారిన పడి మరణిస్తే అడవిలోనే ఆయనకు అంతిమ సంస్కారాలు జరిపించినట్లు పార్టీ ప్రకటించింది. కానీ, దామోదర్ విషయంలో ఇవేమీ లేవు. మావోయిస్టుల పేరిట లేఖ, దామోదర్ మృతి ప్రచారం అంతా పోలీసుల మైండ్‌గేమ్‌లో భాగమనే చర్చ జరుగుతోంది. సూక్ష్మస్థాయిలో మావోయిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం కోసమే వదంతులకు ఊతమిచ్చారని తెలుస్తోంది. గతంలో అనేక పర్యాయాలు ఇలాగే దామోదర్ ఎన్‌కౌంటరయ్యాడంటూ ప్రచారం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల దాడులు ముమ్మరం కావడంతో ఇటీవలి కాలంలో వందల మంది మావోయిస్టులు మరణించారు. పార్టీని కాపాడుకోవాలంటే తెలంగాణ అభయారణ్యాలను సేఫ్‌జోన్‌గా భావిస్తూ అన్నలు తిరిగి స్వరాష్ట్రానికి వస్తున్నట్లు నిఘా వర్గాలకు ఉప్పందింది. అర్బన్ ప్రాంతంలో రహస్యంగా తిష్టవేసి రిక్రూట్‌మెంట్లను పెంచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పసిగట్టారు.

ఈ క్రమంలో సరిహద్దుపై నిఘా పెంచిన తెలంగాణ పోలీసులు మావోయిస్టుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ఇదే సమయంలో కమ్యూనిస్టు భావజాలం ఉండి అజ్ఞాతంలోకి వెళ్లాలనుకునే వారి మనో ధైర్యాన్ని దెబ్బతీసే వ్యూహంలో భాగంగా దామోదర్ మృతి చెందాడని పోలీసులే ప్రచారం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తద్వారా నూతన చేరికలకు అడ్డుకట్ట వేయడం ఖాకీల ఎత్తుగడగా స్పష్టమవుతోంది. ఏదేమైనా ఇటు పోలీసులు కానీ, అటు మావోయిస్టు అగ్రనాయకత్వం కానీ స్పష్టమైన ప్రకటన చేస్తేనే తప్ప దామోదర్ మృతి వార్తలపై నెలకొన్న సందేహాలు తొలిగిపోయేలా లేవు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలోని రూట్‌లలో బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సలహాలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపో పరిధిలోని ఆయా రూట్‌లలో మౌలిక సదుపాయాలు, బస్టాండ్ ఆవరణలో ప్రయాణీకులకు కలిగే ఇబ్బందులు తదితర అంశాలపై సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులు కూడా చేయవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226053 నంబరులో సంప్రదించాలన్నారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

- ఐదుగురికి గాయాలు
- స్నేహితులను కలిసేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్ వద్ద ఘటన
- మృతుడిది భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి



సిద్ధార్థరెడ్డి (ఫైల్)



ప్రమాద ఘటనలో బోల్తాపడిన కారు

జనగామ రూరల్/మొగుళ్లపల్లి జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులను కలిసేందుకు వెళ్తూ యువకుడు అనంత లోకాలకు చేరిన ఘటన జనగామ మండలంలోని పెంబర్తి వైజంక్షన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల పంచాయతీ పరిధి బద్దంపల్లి గ్రామానికి చెందిన బద్దం సిద్ధార్థరెడ్డి(20) తన స్నేహితులైన కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి అభిచరణ్, తోట అక్షిత్, గుజ్జుల నందు, అంజి, బండ గణేష్‌రెడ్డి హన్మకొండలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఉన్న స్నేహితులను కలిసేందుకు కారులో బయల్దేరారు. సిద్ధార్థరెడ్డి కారు నడుపుతుండగా మిగతా వారు ప్రయాణిస్తున్నారు. కారు సోమవారం తెల్లవారుజామున జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో సిద్ధార్థరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. నందు, అంజిలకు తీవ్ర గాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కొరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై సీతక్క ఆగ్రహం

- మా పార్టీవైనా తొలగించండి
- డీపీవోకు మంత్రి ఆదేశం



ములుగులోని ఏరియా ఆస్పత్రి ఎదుట భారీ ఫ్లెక్సీలు

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా పార్టీవైనా సరే తొలగించండి' అంటూ డీపీవోను ఆదేశించారు. ములుగును క్లీన్‌గా ఉంచాలని సూచించారు. సోమవారం ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. ఆస్పత్రి భవనం కనిపించకుండా భారీ సైజులో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల బీజేపీ -కాంగ్రెస్ మధ్య గొడవకు ఫ్లెక్సీలే కారణమైన విషయం తెలిసిందే. ఏరియా ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేసిన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌కు చెందిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయగా.. ఆగ్రహించిన కాం గ్రెస్ నాయకులు బీజేపీ నాయకుడి దుకాణంపై దాడికి పాల్పడ్డా రు. ఆయా పార్టీలకు చెందిన వారు జాతీయ రహదారి పొడవునా డివైడర్‌పై ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటి కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీలను తొలగించాలని గతంలో ప్రజాసంఘాల నాయకులు పోలీసులు, అధికారులను కోరారు. అయితే ఎక్కువ శాతం ఫ్లెక్సీలు అధి కార కాంగ్రెస్‌కు చెందినవే కావడంతో అధికారులు వాటిని తొలగించే సాహసం చేయలేకపోయారు. మంత్రి సీతక్కపై అభిమానంతో బండారుపల్లి రోడ్డు నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా పెద్దసంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు కలెక్టర్ ఆఫీసునూ వదల్లేదు. ప్రధాన ద్వారానికి ఇరువైపులా హస్తం పార్టీకి పోటీగా బీఆర్ఎస్ నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో పక్షపాతం వద్దని మంత్రి ఆదేశాలతో అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరిపెడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ డెవలప్‌మెంట్ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి సత్వరం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మరిపెడ మునిసిపాలిటీలోని పలు కాలనీలలో జరుగుతున్న అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ద్వారా చేపట్టిన పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మరిపెడ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలోని డైనింగ్‌హాల్ పనులను తనిఖీ చేశారు. పట్టణంలోని రాంవిలాస్ గల్లీ, ఆడిటోరియం, మోడల్ మార్కెట్ తదితర వర్క్స్ పరిశీలించి అధికారులను పనుల నాణ్యత ప్రమాణాలపై ఆదేశించారు. కలెక్టర్ వెంట స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ సైదులు, మునిసిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, మునిసిపాలిటీ ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల కతీతంగా గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 5వ వార్డు పరిధిలోని అనంతారంలో ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించతల పెట్టిన సీసీ రోడ్డు, మహబూబాబాద్ మండలం చోక్లాతండా జీపీ పరిధిలోని మేఘ్యాతండాలో రూ.5లక్షలతో నిర్మించే సైడ్ డ్రైనేజీ కాల్వ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. అనంతారంకు ఒక ప్రత్యేకత ఉందని, మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి సొంత గ్రామమని, అందుకోసం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.



మేఘ్యాతండాలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గ్రామసభలకు హాజరు కావాలి

సంక్షేమ పథకాల అమలు కోసం జనవరి 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ కోరారు. గ్రామాల వారీగా కేటాయించిన తేదీల్లో షెడ్యూల్ ప్రకారం అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తారని చెప్పారు. గతంలో ప్రజా పాలన సభల ద్వారా దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డు రాని వారు గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జెన్నారెడ్డి మురళీధర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మీశ్రీను, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, గార్లపాటి సాయి, భూక్య సుందర్, గుగులోతు మురళీ, బోడ సురేష్, రమేష్, బాలకిషన్, నరేందర్, హోలీ, కొండయ్య, లింగ శ్రీను, శేఖర్, అంజిబాబు పాల్గొన్నారు. పట్టణంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18 నుంచి 20 వరకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మె ల్యే మురళీనాయక్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర బాధ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు అచ్చ సుజిత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2387	2160
పల్లికాయ (సూక)	6310	5600
పల్లికాయ (పచ్చిది)	4450	4100
కందులు	7156	5560
పెసళ్లు	6352	4570
పత్తి	7220	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14700	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	14500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కమిటీల పేరుతో కాలయాపన

మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు

- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



వేయిస్తంభాల దేవాలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డెపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, మాలల ఒత్తిడికి తలొగ్గిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేల గొంతులు.. లక్ష డప్పుల సన్నాహక సాంస్కృతిక ప్రదర్శనను సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్‌లతోకలిసి ప్రారంభించారు. తొలుత వేయిస్తంభాల దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మహా సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం తమ వైపు ఉందని అన్నారు. రెడ్ల కాంగ్రెస్‌ను మాల ఎమ్మెల్యేలు శాసిస్తున్నారని పేర్కొన్నారు. మాదిగల ధర్మ పోరాటానికి సబ్బండ వర్గాలు సంఘీభావం తెలుపుతున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని, దీన్ని తొలుత రాష్ట్రంలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని మంద కృష్ణ మాదిగ గుర్తు చేశారు. కేవలం వర్గీకరణను వివేక్ వెంకటస్వామి కుటుంబమే అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ కట్టుబడి ఉందని రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాలల ఎమ్మెల్యేల మెప్పుకోసమే తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగ జాతి కోసం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్ని పార్టీలు కలిసి వచ్చినా కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేయడం విడ్డూరమని విమర్శించారు. ఇప్పటికే దేశంలోని తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ముమ్మరమైందని మంద కృష్ణ మాదిగ వివరించారు. మాలల ఒత్తిడి తలొగ్గితే మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికావలసి వస్తోందని హెచ్చరించారు. ఒకే కుటుంబంలో మూడు పదవులు పొందిన వివేక్, వినోద్, వంశీకృష్ణలు తమ ధన ప్రభావంతో 30 ఏళ్ల వర్గీకరణ పోరాటానికి అడ్డుపడుతున్నారని అన్నారు. వర్గీకరణ చేస్తే కాంగ్రెస్‌ను ఉపేక్షిస్తాం కానీ మాల కులస్థులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని వచ్చే ఎన్నికల్లో మాదిగలు చైతన్యవంతులై వారిని ఓడించడం ఖాయమని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలోని 59 కులాలలో వర్గీకరణకు 58 కులాలు అనుకూలంగా ఉన్నాయని కేవలం మాలలే అడ్డు తగలడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కవి, రచయిత సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ మంద కృష్ణ చేపట్టిన వర్గీకరణ ఉద్యమం న్యాయమైందని దీనికి సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నాయని అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. కవి, గాయకుడు, రచయిత మిట్టపెల్లి సురేందర్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సన్నాహక సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాష్ట, మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, గాయకులు వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, రేలారే రేల గంగా, పాటమ్మ రాంబాబు, ధరువు ఎల్లన్న, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, రాష్ట్ర నేతలు పుట్ట భిక్షపతి మాదిగ, అక్కనకుంట వెంకటస్వామి, ఆరెపల్లి పవన్, బొక్కల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఆధ్యాత్మికం

వృత్తి ఆధ్యాపకం.. ప్రవృత్తి ఆధ్యాత్మికం

- తన తాత బాటలో నడుస్తున్న సంస్కృత పండితుడు
- టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక సేవలు
- 12 ఏళ్లుగా పాశురాలపై తేటతెలుగులో ప్రవచనాలిస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్



ధనుర్మాసం సందర్భంగా ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి రీత్యా అధ్యాపకుడు. ప్రవృత్తి రీత్యా ఆధ్యాత్మిక వేత్త. ఓ వైపు కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరో వైపు ధార్మిక సేవను కొనసాగిస్తున్నారు. ప్రజల్లో సన్మార్గంలో పెట్టేందుకుగాను.. వారిలో ధర్మచింతను పెంపొందించడానికి మూడు దశాబ్దాలుగా విశేషంగా కృషి చేస్తూ.. ప్రత్యేక గుర్తింపు పొందారు ఉభయ వేదాంత డాక్టర్ క్రిష్ణమీనన్. ప్రముఖ సంస్కృత పండితులు, కవి శతాబ్ది కేసరి ఉభయవేదాంత నల్లాన్ చక్రవర్తుల రఘునాథా చార్యుల మనవడైన క్రిష్ణమీనన్ తాత చూసిన బాటలో నడుస్తూ ధార్మిక ప్రవచనాలు చేస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. 12ఏళ్లుగా ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ద్వారా తిరుప్పావై ప్రవచనాలు చేస్తున్న ఆయన.. ధనుర్మాసంలో వివిధ ఆలయాల్లో గోదాదేవి పాశురాలపై చేస్తున్న ప్రవచనాలు ఎందరిలోనో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయి. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ గోదాదేవి మూలద్రావిడలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక పన్నిద్దరాళ్వార్లు రచించిన నాలాయిర దివ్యప్రబంధంలో ఒక ముఖ్యభాగమై తమిళ సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. ఈ పాశురాలను డాక్టర్ మీనన్ తేటతెలుగులో సులభమైన శైలిలో అందరికి అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. ఇక 20ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ఆలయాల్లో ధార్మిక ప్రవచనాలను కొనసాగిస్తున్నారు. ఇలా ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేయడంతో పాటు సంస్కృత అధ్యాపకుడిగా సంస్కృతం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని, అభిరుచిని పెంచేందుకు శ్రమిస్తున్నారు.

పండిత ప్రకర్ష..

డాక్టర్ క్రిష్ణమీనన్ ఉస్మానియా యూనివర్సిటీలో సంస్కృతంలో ఎంఏ ఎంఫిల్, కాకతీయ విశ్వవిద్యాలయలో తెలుగులో ఎంఏ టీపీటీ, తెలుగు వర్సిటీలో ఎంఏ ఆస్ట్రాలజీ చేశారు. తన తాత రఘునాథాచార్యుల వద్ద సంస్కృత వ్యాకరణ ఆధ్యాత్మిక గ్రంథాలను అభ్యసించారు. డాక్టర్ మీనన్ తల్లిదండ్రులు నరసింహాచార్యులు, వెంకటలక్ష్మమ్మ కాగా 30 సంవత్సరాలుగా సంస్కృత ఆధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. 25 ఏళ్లుగా హనుమాన్ జ్యోతిషాలయాన్ని కూడా నిర్వహిస్తున్నారు. డాక్టర్ మీనన్ ప్రస్తుతం ఆల్ఫోర్స్ కళాశాలలో సీనియర్ సంస్కృత అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.



ఆలయంలో ఆశేషంగా హాజరైన మహిళా భక్తులను ఉద్దేశించి తిరుప్పావై పాశురాలపై ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణ మీనన్

పురస్కారాలు..



మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న క్రిష్ణ మీనన్

ఆధ్యాత్మిక రంగంలో చేస్తున్న విశేషమైన కృషికి గుర్తింపుగా పలు సంస్థలు డాక్టర్ మీనన్‌ను సత్కరించాయి. పలు పురస్కారాలను ప్రదానం చేశాయి. అబ్దుల్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుతో సన్మానించింది. బిర్లా ఫౌండేషన్ జ్యోతిష విభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. విశ్వవిజ్ఞాన జ్యోతిష సంస్థ గౌరవ డాక్టర్‌తో, కేన్యూస్ చానెల్ ఉగాది పురస్కారంతో సత్కరించింది. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలతో అనుబంధం కలిగి ఉన్న డాక్టర్ క్రిష్ణమీనన్ ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర సంస్కృత భారతి ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం వరంగల్ సంస్కృత అధ్యాపకుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి.. ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

- ఎక్సలెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు



హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసినవారికి ప్రతిష్టాత్మకమైన గవర్నర్ ఎక్సెల్లెన్సీ అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాది ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ పురస్కారాలకు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిలో ఒకరు ప్రొఫెసర్ పాండురంగారావు కాగా మరొకరు పారా అథ్లెటిక్ జీవంజి దీప్తి. సంస్కృతి, వారసత్వ సంపద కేటగిరీలో పాండురంగారావుకు ఈ అవార్డురాగా దీప్తికి క్రీడారంగంలో ప్రతిభ చాటినందుకుగాను దక్కింది. రాష్ట్రంలో మొత్తం 8 మందికి ఈ అవార్డులు రాగా వీరిలో ఇద్దరు ఉమ్మడి వరంగల్ వారే కావడం విశేషం. ప్రధానంగా నాలుగు రంగాలు- పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, కల్చర్‌లో విశేషమైన కృషి చేసినందుకు గుర్తిం పుగా గవర్నర్ చేతుల మీదుగా ఈ ఎక్సెల్లెన్స్ అవార్డుల ప్రదానం జరగనుంది. ఈ అవార్డు కోసం గత నవంబరులో దరఖాస్తులను కోరగా 594 మంది దాఖలు చేశారు. అవార్డుల కమిటీ వడపోత తర్వాత ఎనిమిది మంది ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద రూ.2లక్షల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

వారసత్వ పరిరక్షణలో పాండురంగారావు కృషి

కాజీపేట సిద్ధార్థనగర్‌లో నివాసముంటున్న వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాకతీయుల వారసత్వ సంపద, ప్రాచీన కట్టడాలు, అలనాడు వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను కాపాడడంలో విశేషంగా కృషి చేశారు. విద్య, వైద్య రంగాల్లోనూ ఆయన విస్తృతమైన సేవలు అందించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (జీయాలజీ), ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేశారు. ప్రొఫెసర్ పాండురంగారావు చదువుల్లోనే కాకుండా ఆటల్లోనూ మేటి అనిపించుకున్నారు. వరంగల్ నగరంలో 1972, 1973 సంవత్సరంలో తీవ్రమైన కరువు ఏర్పడి తాగునీటి సమస్య తలెత్తినప్పుడు దాని శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. 1984లో తాను పని చేస్తున్న ఆర్ఈసీ (ప్రస్తుతం నిట్)లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నప్పుడు త్రీ డైమెన్షనల్ మోడల్ ప్రాజెక్టులో భాగంగా శ్రీరాం సాగర్ వరద నీటిని వాడుకోవడంతో పాటు ఫ్లడ్‌ఫ్లో కెనాల్, మిడ్‌మానేర్ డ్యాం డిజైన్‌లో కీలక భూమిక పోషించారు. అలాగే కాకతీయుల కట్టడాలు, నీటిపారుదల ప్రాజెక్టులపై విస్తృతమైన పరిశోధన చేశారు. జీయో టెక్నికల్ అప్రైజల్ అండ్ ఎవాల్యూషన్ ఆఫ్ కాకతీయ మాన్యుమెంట్స్ పేరుతో భారత పురావస్తు శాఖ చేపట్టిన రీసెర్చ్ ప్రాజెక్టుకు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఏడేళ్లపాటు సుదీర్ఘంగా అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను సమర్పించారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి ఆవరణలో శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపాన్ని పునర్నించడంలో ప్రొఫెసర్ పాండురంగారావు చేసిన కృషి అమూల్యం. 30సంవత్సరాలుగా ఇంటాక్ కన్వీనర్‌గా ఆయన అనేక కాకతీయ కట్టడాల పునరుద్ధణకు కృషి చేశారు. 2009లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ పాపారావుతో కలిసి ఏర్పాటు చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా కాకతీయుల వారసత్వ సంపద, వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ప్రాముఖ్యతను విశేషంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. చారిత్రకంగా సుప్రసిద్ధమైన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడంతో ప్రొఫెసర్ పాండురంగారావు ఎంతగానో శ్రమించారు. రామప్పపై ప్రత్యేకంగా ఒక డోజర్‌ను రూపొందించడం ద్వారా యునెస్కో ప్రతినిధులను ఒప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. నగరంలోని ఎంజీఎం, సీకెఎం ఆసుపత్రుల అభివృద్ధికి శ్రమించారు. హెరిటేజ్, కల్చర్, విద్య, వైద్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ప్రొఫెసర్ పాండురంగారావు అనేక పురస్కారాలను అందుకున్నారు. తాజాగా గవర్నర్ ఎక్సెలెన్స్ అవార్డు కూడా వరించింది.

వైకల్యాన్ని జయించి..అవమానాలను అధిగమించి..

పేదరికాన్ని లెక్కచేయకుండా.. వైకల్యాన్ని జయించి.. అవమానాలను అధిగమించి.. రికార్డుల రారాణిగా సత్తా చాటి ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా ఒలింపియన్ జీవంజి దీప్తికి మరో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన ఆమె ఇటీవలే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అర్జున అవార్డును అందుకోగా... తాజాగా గవర్నర్ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె రూపం గురించి ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదురైనా క్రీడల్లో రాణించి పారా ఒలింపిక్స్‌లో అర్జున పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు పారాలింపియన్‌గా నిలిచారు.

వేగంగా జరుగుతున్న షెడ్ నిర్మాణం



24న కొండపర్తికి గవర్నర్

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు



తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కొండపర్తి గ్రామానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారని సమాచారం. గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తిని మోడల్ గ్రామంగా రూపొందించే దిశగా అధికారులు పలు అభివృద్ధి పనులు ప్రాంభించారు. ఈ నెల 24న గవర్నర్ కొండపర్తికి వచ్చే అవకాశం ఉన్నందున అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో షెడ్ నిర్మాణాలు, పాఠశాల మరమ్మతు, ప్రారంభం రోజు కొమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. 23వ తేదీలోగా కుట్టు మిషన్లు, ప్యాకింగ్ మిషనరీ, ప్లేట్ల తయారీ మిషన్లు గ్రామానికి చేరుకోనున్నాయి.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో మొదలైన మినీ సంబురం

ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేతలకు ముందస్తు మొక్కులు ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం సుమారు 10వేల మందికి పైగా భక్తులు మేడారం చేరుకున్నారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలకు పూజలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారెలు కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. యాట మొక్కులను చెల్లించుకొని కోరికలు తీరాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ పరిసరాలు, అడవి ప్రాంతాలు, వసతి భవనాల్లో విడిది చేసి సేద తీరారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 20 : డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి సాధనలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని సాధించామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంచుకొంటూ ఆ మేరకు ఫలితాలు సాధిస్తూ వచ్చామన్నారు. రూ. 2 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గం మహాజన సభ జరిగింది. డీసీసీ బ్యాంకు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరిగింది. సభను ఉద్దేశించి రవీందర్‌రావు మాట్లాడారు. బ్యాంకు సేవలు, ఆర్థికాభివృద్ధి, రుణాలు, రైతు రుణమాఫీ, రుణాల రికవరీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మల్టీ సర్వీసు సెంటర్లు నిర్వహణ తదితర అంశాలను రవీందర్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్

రూ.860 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల టర్నోవర్ దశకు బ్యాంకు చేరడం మాములు విషయం కాదన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యుల సమష్టి కృషే కారణమన్నారు. తమ పాలకవర్గం ఏర్పడిన సమయంలో రూ.860 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు ఉందన్నారు. ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంపు ప్రణాళికను రూపొందించుకున్న సమయంలో అనేక అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. అయితే బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగామన్నారు. ఈ ప్రయాణంలో రూ.1160 కోట్ల టర్నోవర్‌కు చేరడం మాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచిందని చైర్మన్ రవీందర్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు డీసీసీ బ్యాంకు అంటే రైతులకు పరిమితమని భావన ఉండేదన్నారు. కానీ ఇప్పుడా పేరే లేదన్నారు. కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడీ సేవలు అందుతున్నాయన్నారు.

అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందాం...

బ్యాంకు సేవలను విస్తరించడం వల్ల రైతులకే కాకుండా అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందగలిగామని రవీందర్‌రావు వెల్లడించారు. పంట రుణాలతో పాటు వ్యాపార, విద్య, స్వయం ఉపాధి రంగాలకు సైతం బ్యాంకు రుణాలను విస్తరించడంతో పాటు ప్రజల ఆదరాభిమానాలను బ్యాంక్ చూరగొంటుందన్నారు. ముఖ్యంగా దళారీ వ్యవస్థ లేకుండా రైతులు ఇతర వర్గాలకు రుణాల అందజేత జరిగిందన్నారు. రుణాల మంజూరిని అన్ని వర్గాలకు విస్తరించడంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ జీవితాల్లో ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు కోట్లలో రుణాల కల్పన జరుగుతుండడంతో మహిళలు ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు.

ఏ గ్రేడ్ సాధనతో బాధ్యత మరింత పెరిగింది...

రాష్ట్రంలోనే వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ అన్ని విభాగాల్లో ఉన్నత ఫలితాలను సాధిస్తోందని రవీందర్‌రావు వెల్లడించారు. గతంలో నాబార్డ్ ప్రకటిత ర్యాంకుల్లో వరంగల్ చివరలో ఉండేదన్నారు. కానీ ఈ సారి 'ఏ' గ్రేడ్‌ను సాధించిన ఘనతను దక్కించుకుందన్నారు.

తొలి సారిగా మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటు

డీసీసీ బ్యాంకు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో మల్టీ సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఏయస్‌లు ఈ సెంటర్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటులో భాగంగా పీఏసీయస్ ఆధ్వర్యంలో గోదాంల నిర్మాణం, నిర్వహణ, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్ తదితర వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయన్నారు. వీటి ద్వారా లభించే ఆర్థిక వనరులతో పీఏసీయస్‌లు స్వయం ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. బ్యాంకు టర్నోవర్ ప్రగతితో పాటు అనేక విభాగాల్లో ఉన్నతి ఫలితాలను సాధించడం పట్ల చైర్మన్ రవీందర్‌రావును బ్యాంకు అధికారులు, సభ్యులు అభినందించారు.

డీసీవోల తీరుపై మండిపాటు

సమావేశంలో పాలకవర్గ సభ్యులు పలువురు డీసీవోల తీరుపై మండిపడ్డారు. కొందరు డీసీవోలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్యాంకు సేవలను రైతులు ఇతర వర్గాలకు అందచేయడమే లక్ష్యంగా తాము పని చేస్తుంటే డీసీవోలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ పద్ధతిని మార్చుకోని పక్షంలో తమ ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంకు వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, నరేందర్, రవిరాజా, సంజీవరెడ్డి, డీజీయం అశోక్, నాబార్డ్ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
మంగళవారం 21 జనవరి 2025
8

ఇంధన వరులను సద్వినియోగం చేసుకోవాలి: ట్రాన్స్‌కో ఎస్ఈ

కాటారం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు సంప్రదాయ ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్ అన్నారు. సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్న గ్రామాల్లో భూపాలపల్లి జిల్లాలోని కాటారం గ్రామం మోడల్ సోలార్ విలేజ్ గా ఎంపికైందని వెల్లడించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కాటారం గ్రామప్రజలు, నాయకులకు టీజీ రెడ్కో(తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్), ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై సోమవారం సాయంత్రం అవగాహన సమా వేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన కాటారం గ్రామంలో ఉచితంగా సౌర విద్యుత్ ప్యానెళ్లను, ఇతర పరికరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టీజీ రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సోలార్ విద్యుత్‌నుఉత్పత్తి చేసుకుని అవసరం మేర వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తే ట్రాన్స్‌కో ప్రతి యూనిట్‌కు రూ.5వరకు చెల్లిస్తుందన్నారు. ఏడీఈ నాగరాజు, సబ్ ఇంజనీర్‌రెడ్డి, ఎల్ఐ కిరణకాంత్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సభలకు సర్వం సిద్ధం

నేటి నుంచి ప్రారంభం • కలెక్టర్ దివాకర వెల్లడి



ములుగు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 24వ తేదీ వరకు గ్రామసభల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశామని, లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ఇందుకు జిల్లా ప్రజలు సహకరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర సోమవారం పేర్కొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈనెల 16 నుంచి 20 వరకు దరఖాస్తులు పరిశీలించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిపబ్లిక్ డే నుంచి నాలుగు పథకాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతుభరోసా పంట వేసినా, వేయకపోయినా అందుతుందన్నారు. రైతు భరోసా పథకానికి ఎలాంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు, ఒక్కో విడతకు రూ.6వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందన్నారు. 2023-24సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలో 20రోజులు ఉపాధిహామీ కూలీలుగా పనిచేసిన కార్మికుల జాబితాను తీసుకుని ఆధార్‌కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమి లేని కుటుంబాలను ఎంపిక చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ద్వారా సొంతభూమి ఉండి ఇళ్లులేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామన్నారు. గ్రామసభలో అభ్యం తరాలను స్వీకరించి అర్హుల జాబితా గ్రామాల వారీగా సిద్ధం చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామసభలో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుని కుటుంబంలో విభజన అయినవారు, కొత్తకార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాల్లోకి వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పథకాలపై సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 1800 425 7109ను సంప్రదించాలని ఆయన కోరారు.

రామప్ప వద్ద నీటి సరఫరా పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకటాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప పరిసర ప్రాంతాలకు నీటి సరఫరాను సోమవారం అధికారులు పునరుద్ధరించారు. వారం రోజులుగా ఆలయ పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిన విషయంపై ఆంధ్రజ్యోతి 'రామప్ప పరిసరాల్లో నీటి కొరత' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజ్, స్థానిక తహసీల్దార్ గిరిబాబుల ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం, డీఈ సునీత, ఏఈ ప్రవీణ్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి రేవతి నీటి వాల్వ్‌కు మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

శిలాఫలకం ధ్వంసం

ఏటూరునాగారం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్ల- మల్యాల మధ్య ఉన్న జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలాకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం జంపన్నవాగు ఉధృతికి దొడ్ల- మల్యాల గ్రామాల మధ్యగల బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ వాసులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం గతేడాది రెండు గ్రామాల మధ్య జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 9.50 కోట్లను మంజూరు చేసింది. 16 మార్చి 2024లో మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. గతేడాది వానకాలానికి పనులు పూర్తికాకపోవడంతో ఐటీడీఏ ద్వారా రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఐరన్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. కానీ అది నిర్మాణ దశలోనే జంపన్నవాగు ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో వానకాలంలో రెండు గ్రామాలకు రాకపోకలు లేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని రామచంద్రాపురంలో సోమవారం ఉదయం పిచ్చి కుక్క ఐదుగురిపై దాడి చేసింది. గాయం ఇంద్రారెడ్డి, గడ్డం తేజ, నాగుల నీల, కొలిపాక రవితో పాటు మరో వ్యక్తిని కరిచింది. ఎనిమిదేళ్ల తేజ పొట్టభాగంలో తీవ్రంగా గాయం ఏర్పింది. వారిని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చిన కుటుంబసభ్యులు వైద్యం చేయించారు. గ్రామంలో వీధికుక్కలు పెరిగి పోయాయని, బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

గోవిందరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే పంపిణీ చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సామల రమ, సరోజన, ఆడెపు లక్ష్మి, గోపిదాసు నిర్మల, స్వరూప, ఉమ, సమ్మక్క, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

కన్నాయిగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామస్థుల ముందు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని గ్రామస్థులు గ్రామ సభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

ములుగు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని ఉపా ధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం, నల్లగొండ, వరంగల్ నియోజకవర్గ జాక్టో ఉపాధ్యా య సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. సోమవారం ఆయన ములు గులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయసు 61 సంవత్సరాలకు పెంపు, పీఆర్సీలో 30 శాతం ఫిట్‌మెంట్ సాధన, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించడం, కేజీబీవీ ఉపాధ్యాయినిలకు 180 రోజుల మెటర్నిటీ సెలవుల సౌకర్యం వంటివి సాధించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జీవో 317 వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూస్తానని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాల మంజూరు, కేజీబీవీ సిబ్బంది, సమగ్ర శిక్షా సిబ్బంది, సీఆర్టీలకు మినిమం టైం స్కేల్ వర్తింపజేసేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, నాయకులు పోరిక శంకర్, సోలం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీపీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 51 ప్రకారం మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల వేతనాలు పెంచి అర్హులైన వారిని క్రమబద్ధీకరించి స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కట్ల నర్సింహాచారి, రాజేందర్, కార్మికులు రంజిత్, శ్రీను, బుచ్చిబాబ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై గుంతలు పూడ్చిన పోలీసులు

ఏటూరునాగారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ సూచనలతో ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది 163వ హైవేపై గుంతలను సోమవారం పూడ్చి వేయించారు. ఈ రహదారిలో భారీ వాహనాలు వెళ్తుండడం వల్ల మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు నుంచి మండలంలోని చిన్నబోయినపల్లి మధ్యలోని పలు ప్రాంతాల్లో ఇటీవల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మండలంలోని పలు ప్రాంతాలు, ఐటీడీఏ పీవో గెస్ట్ హౌస్ మలుపు, కార్యాలయం ఎదుట, అటవీశాఖ చెక్ పోస్ట్ క్రాస్ వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించారు.

సరస్వతీ పుష్కరాలకు శృంగేరి పీఠాధిపతులకు ఆహ్వానం



పీఠాధిపతికి ఆహ్వాన పత్రి అందిస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మే నెల 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు నిర్వహించడానికి దేవాదాయ శాఖ మంత్రి, ఐటీ శాఖ మంత్రి ఆదేశాల మేరకు సోమవారం ఆలయ నిర్వాహకులు, అర్చకులు శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానించారు. ఈ మేరకు శృంగేరి పీఠాధిపతుల వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుని ఆహ్వానం అందించారు. దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో అర్చకులు బల్లారిలోని శృంగేరి మఠానికి వెళ్లారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి తీర్థస్వామి వారిని దర్శించుకున్నారు. కుంభాభిషేకం, సరస్వతీ పుష్కరాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ కమిషనర్ ఎం.రామ కృష్ణ రావు, గోవిందహరి, ప్రత్యేక ఆహ్వానితులు ఎం.మారుతి, సూప రిం టెండెంట్ శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకుడికి సన్మానం



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న సెక్యూరిటీ గార్డులు

కాకతీయఖని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నియమితుడైన వేణుగోపాల్‌ను భూపాలపల్లి ఏరియా సింగరేణి సెక్యూరిటీ గార్డులు సోమవారం సన్మానించారు. ఎస్ఎన్‌పీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గార్డులు కుమార్ యాదవ్, వీరస్వామి, శ్రీనివాస్, సారంగపాణి, సంపత్‌రావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 200లకు పైగా ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించగా దానిని డీఎస్పీ ప్రారంభించారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, పీఎస్సై హేమలత, పోలీస్‌సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

మల్హర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం నుంచి 15 జీపీల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాల సంబంధించిన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. 16 నుంచి 20 వరకు గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో సమగ్ర సమాచారణ సేకరణ చేశారని ఆయన తెలిపారు. 21న మండలంలోని అడ్వాలపల్లి, చిన్నతూండ్ల, దుబ్బపేట, 22న ఎడ్లపల్లి, కొండంపేట, కొయ్యూర్, అన్‌సాన్‌పల్లి, మల్లంపల్లి, 23న ఇప్పలపల్లి, మల్లారం, నాచారం, 24న వల్లెంకుంట,పెద్దతూండ్ల, రుద్రారం, తాడిచర్లలో గ్రామసభలు నిర్వహించనున్నారు. రేషన్‌కార్డులు రాని వారు ఈ గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి సర్వే

మహదేవపూర్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మందరం చెరువు నుంచి ఎన్కపల్లి వరకు నిర్మించబోయే మెయిన్ కెనాల్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం కోసం సోమవారం అధికారులు సర్వే నిర్వహించారు. మండలంలోని ఎన్కపల్లి, రాపల్లికోట శివార్లలో కెనాల్ నిర్మాణం కోసం ఎంత మేరకు భూసేకరణ అవసరమవుతుంది, కెనాల్ ఏయే సర్వే నెంబర్ల మీదుగా వెళ్తుంది అనేది గుర్తించనున్నారు. సర్వేలో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన జాతీయ బృందం

మహాముత్తారం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): బోర్లగూడెం హెల్త్‌అండ్‌వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సోమ వారం సందర్శించింది. పలు రికార్డులను బృందం సభ్యులు పరిశీలిం చారు. వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలను సిబ్బదిని అడిగి తెలుకున్నారు. బృందంలో వైద్యులు సత్యకుమార్, కిరణ్‌పాటిల్, జిల్లా వైద్యాధికారి మధు సూదన్, డాక్టర్లు శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్, స్థానిక వైద్యులు సందీప్, జ్యోతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ధర్నా

మహదేవపూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కంబాల రాములుపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఎమ్మార్సీ ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీఎఫ్ జిల్లా కన్వీనర్ బి.తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.రాజరెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు పి.సరిత, ఆర్.తిరుపతిరెడ్డి, కళ్యాని, మధు, జి.రాజయ్య పాల్గొన్నారు.

• మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): రంగరెడ్డి జిల్లా తుక్కుగూడ పాఠశాలలో ఉపాధ్యయుడు రాములుపై దాడి ఖండిస్తు సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్, మోడల్ స్కూల్, యామన్‌పల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నల్ల బ్యాడ్జిలు ధరించి డీటీఎఫ్ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీగీఎఫ్ నాయకులు రమణారెడ్డి, తిరుపతి రెడ్డి, రాంపింగ్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు అప్పగించాలి

కలెక్టర్‌కు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగజ్యోతి

ములుగు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు అప్పగించాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు, తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామానికి చెందిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి ములుగు జిల్లా కలెక్టర్ దివాకరను కలిశారు. నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను వెంటనే అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023లో గత ప్రభుత్వం కాటాపూర్‌లోని ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన 108 మంది ఇళ్లు లేని వారికి ఒక్కో కుటుంబానికి 75 గజాల చొప్పున ఇంటి స్థలాలను మంజూరు చేశారన్నారు. అదే సమయంలో ఎన్నికలు రావడంతో ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు అప్పగించడంలో జాప్యం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో లబ్ధిదులు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాగజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పులి నర్సయ్య, సుల్లూరి గౌరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింగరావు, పీఏసీఎస్ డైరక్టర్ లాలయ్య, సయ్యద్ హుస్సేన్, లక్ష్మీనర్సయ్య, రాంబాబు, పుల్లూరి రమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

టేకుమట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం లబ్ధిదారుల ఎంపికపై మంగళవారం నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మండలంలోని రాఘవరెడ్డిపేట, ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లిలో ఇంటింటి సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా అందాలన్నదే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. నూతన రేషన్‌కార్డులకు దరకాస్తులు స్వీకరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఏవో కల్యాణ్ ఉన్నారు.

సబ్ కలెక్టర్ పరిశీలన

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాని, గుమ్మళ్లపల్లి, ఇబ్రహీంపల్లి, నస్తూరుపల్లి, జాదరావుపేట, గుండ్రాత్‌పల్లి జీపీల పరిధిలో అధికారులు, వివిధ శాఖల సిబ్బంది సోమవారం క్షేత్రస్థాయి సర్వేను సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట డీఆర్డీవో నరేష్, ఎంపీడీవో అడ్డూరి బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న, ఆర్ఐ వెంకటయ్య, కార్యదర్శులు, టీఏలు, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మడి, మహదేవపూర్, ఎడపల్లి గ్రామాల్లో సోమవారం సబ్ కలెక్టర్ మయాంక్ పర్యటించారు. రేషన్‌కార్డులు, రైతు భరోసా తదితర పథకాలపై నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు.

అదనపు కలెక్టర్, ఆర్డీవో పరిశీలన

చిట్యాల (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో ఎన్.రవి పరిశీలించారు. మండలంలోని గుంటూరుపల్లి, ఒడితల గ్రామాలను వేర్వేరుగా సందర్శించి సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ రాజు, ఏఈవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురంలో కొనసాగుతున్న సర్వేను ఆర్డీవో రవి పరిశీలించారు. గ్రీన్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల ధర్నా

ములుగు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని గీత కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని జాతీయ రహదారిపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, గుండెబోయిన రవిగౌడ్ మాట్లాడారు. గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులు, బైక్‌లు ఇవ్వాలని, రద్దయిన సొసైటీలను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తాడి కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని, ప్రతి సొసైటీకి పదెకరాల భూమి కేటాయించాలని, 50 ఏళ్ల నిండిన గీత కార్మికులకు రూ.4వేల పెన్షన్ అందించాలని, గ్రామాల్లో బెల్టుషాపులను రద్దు చేయాలని, జిల్లాకేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అధికారికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లొడే శ్రీనివాస్, గడ్డం శ్రీధర్, జక్కు రాజు, కాసగాని స్వామి, బలుమల్లు, సాంబయ్య, జనార్దన్, దేశిని రమేష్, ప్రభాకర్ తదతరులు పాల్గొన్నారు

2కే రన్‌లో పాల్గొనాలి

తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ములుగులో నిర్వహించే 2కే రన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కోరారు. పోటీలో గెలుపొంది మండలానికి బహుమతులు తేవాలని ఎస్సై సోమవారం కోరారు. అలాగే పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు 20 మందికి హెల్మెట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో ఉదయం 6 గం టలకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని సూచించారు.

గొత్తికోయలకు దుప్పట్లు పంపిణీ

గోవిందరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాజెక్టునగర్ గొత్తికోయలకు సోమవారం పస్రా ఎస్సై కమలాకర్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు సహకరించడం, ఆశ్రయం కల్పించొద్దన్నారు. గూడెంలోకి అనుమానాస్పదంగా వచ్చే వ్యక్తుల సమాచారం అందించాలని సూచించారు.

ఒకరిపై కేసు నమోదు

వాజేడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం వెంకటాపురం సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ గుమ్మడిదొడ్డి వద్ద వాహన తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దుర్గం ప్రవీణ్ 120 లీటర్ల గుడుంబాతో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని స్టేషన్‌కు తరలించి గుడుంబా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మహిళల అభ్యున్నతికి కార్యాచరణ

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. హెల్మెట్, సీట్‌బెల్టు ధరించి వాహనాలు నడిపితే 90శాతం వరకు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే టీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించారు. కలెక్టర్ టీఎస్ దివాకర, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, డీఎస్పీ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన తోటకూరి శ్రీకాంత్‌గౌడ్‌ను మంత్రి సీతక్క ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్యవేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను దత్తత తీసుకోవాలి

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాలను కార్పొరేట్ సంస్థలు దత్తత తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సింక్రోని, ఓపెన్ టెక్స్ సంస్థల సహాయంతో నిర్మాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 130 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే ఎల్బీనగర్‌లో బోర్‌వెల్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వి.వెంకటకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వం అండ

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.కోటి నిధులతో నిర్మించిన పీఏసీఎస్ భవనం, రూ.7.99 లక్షలతో చేపట్టిన హనుమాన్ ఆలయం ప్రహరీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ రవిచందర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అంతకుముందు గ్రామంలోని ఆదివాసీ గూడానికి చేరుకుని లక్ష్మీదేవరకు మొక్కులు చెల్లించుకున్నారు.

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.భగవాన్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.రాజేందర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎం.కోటి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, మేడారం జాతర డైరెక్టర్ మిల్కూరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భూపాలపల్లి మండలంలోని బావ్‌సింగ్‌పల్లి గ్రామంలో ఆమె సోమవారం రాత్రి పర్యటించారు. డీఎంఎఫ్‌టీ రూ.10 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు.

పోలీసుల అదుపులో ఐదుగురు

ఓసీలో చోరీ కేసులో విచారణ

కాకతీయఖని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2లోని ఓల్డ్ డంపర్ షెడ్‌లో ఈ నెల 17 అర్ధరాత్రి ప్రైవేటు సెక్యూరిటీ గార్డును బెదిరించి దొంగత నానికి యత్నించిన కేసులో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అయితే.. దొంగతనానికి ప్రధాన సూత్రధారి అయిన వ్యక్తిని తప్పించేందుకు ఓ పార్టీకి చెందిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు పావులు కదుపుతు న్నట్లు తీవ్ర చర్చ సాగుతోంది. సూత్రధారిని తప్పించేందుకు ఫిర్యాదుదాడిపై ఒత్తి తెస్తున్నట్టు పలువురు సెక్యూరిటీ గార్డులు చెబుతున్నారు. పోలీసులకు మొదట ఇచ్చిన ఫిర్యాదులో రెండు సెల్‌ఫోన్లు దొరికినట్లు, అక్కడికి చోరీ చేసేందుకు వచ్చిన వారు ఓ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుతో మాట్లాడినట్లు రాసి ఇచ్చారని, అయితే ఆ ఫిర్యాదును పోలీసులు మార్చి పిటిషన్ దారుడితో సంతకం తీసుకోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. ఈ విషయమై ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ నిందితులను ఐదుగురిని పట్టుకున్నామన్నారు. వారిలో నలుగురు మేజర్లు గాక, ఒక మైనర్ ఉన్నాడని తెలి పారు. వారిని పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తి అయ్యాక కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఇదిలా ఉండగా సింగరేణిలో ఏ దొంగతనం జరిగినా సింగరేణి సెక్యూరిటీ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేవారని, ఈ కేసులో మాత్రం ప్రైవేటు సెక్యూరిటీ గార్డుతో ఫిర్యాదు ఇప్పించడం పట్ల విమర్శలు వస్తున్నాయి.